క్లుప్తంగా

ప్రసన్నను కలిసిన నేతలు



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాసయాదవ్, సత్తార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోతురాజు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై కేసులు పెట్టి చార్జిషీట్ బనాయించడాన్ని ఖండిస్తూ నిరసనను ఆ పార్టీ నేతలు బుధవారం చేపట్టారు. వీఆర్సీసెంటర్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలియజేశారు. పార్టీ నేతలు సంజయ్‌కుమార్, ఇర్ఫాన్, అల్లావుద్దీన్, మల్లికార్జునరెడ్డి, సుధీర్, ధనుంజయ, గణేష్, రాజశేఖర్‌రెడ్డి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో సౌర వెలుగులు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ సౌర వెలుగులతో కళకళలాడుతోంది. స్టేడియంలో 125 సోలార్ విద్యుత్ స్తంభాలకు ఎల్‌ఈడీ సోలార్ లైట్లను ముత్తుకూరు మండలంలోని సదరన్ గ్లోబల్ ఎనర్జీ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేశారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభ్యర్థనను మన్నించి వీటిని ఏర్పాటు చేయడంపై డీఎస్‌డీఓ యతిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



నెల్లూరు(బృందావనం): రామలింగాపురంలోని నారాయణ కాన్సెప్ట్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డేను బుధవారం నిర్వహించారు. యూకేజీ నుంచి ఒకటో తరగతికి.. ఐదు నుంచి ఆరో తరగతికి వస్తున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, పాఠశాలల డీన్ నరేంద్ర, ప్రైమరీ సెంట్రల్ కో ఆర్డినేటర్లు ప్రసన్న, దీప్తి, ప్రిన్సిపల్స్ వెంగళరావు, సోనీ, వైస్ ప్రిన్సిపల్స్ విజయలక్ష్మి, ఫాతిమా, పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి శివరంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన దవనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉభయకర్తగా కొండపల్లి సత్యనారాయణరావు వ్యవహరించారు. ఈఓ రఘురామయ్య, మహేష్ పర్యవేక్షించారు.

⇨ ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో తీర్థవాది, పట్టాభిషేకం, గజవాహనసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా కొంజేటి నారాయణ, కొల్లూరు లక్ష్మీనరసింహం, కొల్లూరు మనోహర్‌కుమార్ దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య పర్యవేక్షించారు.

⇨ మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ముసుగులసేవ, పొన్నవాహనసేవను నిర్వహించారు. పేట ఉత్సవాన్ని జరిపారు. ఉభయకర్తలుగా వాసుదేవ్, చాట్ల వెంకటస్వామి, నరసింహారావు, శ్రీనివాసులు, రామారావు దంపతులు వ్యవహరించారు. దేవస్థాన వంశ పారంపర్య ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, ఈఓ జంజం శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

⇨ శబరి శ్రీరామక్షేత్రంలో కోదండరామ, ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. హనుమత్, సీతా, లక్ష్మణ సహిత కోదండరామస్వామికి పుష్పయాగాన్ని విశేషంగా నిర్వహించారు. ఉక్తహోమాలను జరిపారు. గురుకృప కళాక్షేత్ర సురభిగాయత్రి శిష్యబృందం ప్రదర్శించిన నృత్యాంజలి అలరించింది. ఉభయకర్తలుగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి దంపతులు వ్యవహరించారు.

⇨ నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో తీర్థవాది, ధ్వజావరోహణాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా వర్రే సుధీర్, సాయిరామకుమారి తదితరులు వ్యవహరించారు. ఈఓ మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు.

కూడళ్లలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ



మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన కూడళ్లలో అవసరమైన చోట సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. నగరంలోని 17వ డివిజన్ ఆకుతోట, యూకోనగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు ప్రాంతాలవారీగా విధులను కేటాయించి వీధులను శుభ్రం చేయడం, కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులు నిరంతరం జరిగేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. హైవే నుంచి స్థానిక కల్యాణ మండపం వరకు సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. అనుమతుల్లేని భవన నిర్మాణాలు, అక్రమ కట్టడాలను గుర్తించి పునాదుల దశలోనే తొలగించాలని చెప్పారు. అనంతరం గుజరాత్ నుంచి తెప్పించిన ఫోర్ ఇన్ వన్ రీసైక్లర్ వాహన పనితీరును రామ్మూర్తినగర్‌లో పరిశీలించారు. కార్పొరేటర్ పేనేటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులను సిద్ధం చేయండి

నగరపాలక సంస్థ పరిధిలో నిర్దేశించిన పార్కులను వేసవి సెలవులకు ముందే అన్ని వసతులతో అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌లో ఇంజినీరింగ్ అధికారులు, పార్కుల అభివృద్ధి కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాసులుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. 45 పార్కులకు గానూ తొలి విడతలో 23 పార్కుల్లో మౌలిక వసతులను ఎస్ క్యాప్ నిధులతో కల్పించనున్నామని పేర్కొన్నారు. ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, ఇంజినీరింగ్ విభాగ ఈఈలు రహంతుజానీ, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



నెల్లూరు(క్రైమ్): మహిళలు, చిన్నారుల రక్షణ చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఏఎస్సై శ్రీహరి సూచించారు. గుడ్. బ్యాడ్‌టచ్, బాల్యవివాహాలు, పోక్సో యాక్ట్, శక్తి యాప్ తదితరాలపై జెండావీధిలోని పీఎస్సెమ్ పాఠశాల విద్యార్థినులకు బుధవారం అవగాహన కల్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడే ముఠాలపై బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు రవీంద్రయ్య, ఏఎస్సై సతీష్, సిబ్బంది అనసూయ, ప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రమణారెడ్డికి సత్కారం



నెల్లూరు(అర్బన్): బెస్ట్ యాంట్రప్రెనార్ డాక్టరేట్‌ను హైటెక్ ఫార్మసీ అధినేత రమణారెడ్డి అందుకోవడాన్ని పలువురు అభినందించారు. నగరంలోని ఓ హోటల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను సత్కరించారు. కొండూరు హరి నారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దీన్ని ప్రదానం చేశారని వివరించారు. భాస్కర్‌రెడ్డి, సతీష్, ప్రసాద్‌బాబు, అర్జున్, అర్షద్, శ్రీనాథ్, శివతేజ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రక్షణకు శక్తి యాప్



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెల్లూరు సిటీ: మహిళల రక్షణ కోసం శక్తి యాప్‌ను రూపొందించారని రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సౌత్‌మోపూరులోని వాణిశ్రీ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ యాప్‌ను మహిళలు తన ఫోన్లో ఇన్‌స్టల్ చేసుకోవాలని సూచించారు. 100, 1098, 112, 1930 కాల్‌సెంటర్లు 24 గంటలూ పనిచేస్తాయన్నారు. ఐసీడీఎస్ అధికారి లక్ష్మీదేవి, సీఐ వేణు, పీహెచ్‌సీ వైద్యుడు రవీంద్రరెడ్డి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, శక్తి టీమ్ ఇన్‌చార్జి సుబ్బరాజు, హెచ్‌ఎం అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



జ్ఞాపికలను అందజేస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): పర్యావరణంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకొని, ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలని అటవీ శాఖ నెల్లూరు రేంజర్ మాల్యాద్రి పేర్కొన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల విద్యార్థులతో నేచర్ క్యాంప్‌ను ఏపీ నేషనల్ గ్రీన్ కోర్, పర్యావరణ విద్యాసంస్థ సౌజన్యంతో బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించి ప్రశంసపత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. న్యాయనిర్ణేతలుగా జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు హరిబాబు వ్యవహరించారు. నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కో ఆర్డినేటర్ భక్తవత్సలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



క్రికెట్ టీమ్‌తో అతిథులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని నారాయణ మెడికల్ కళాశాల క్రీడా మైదానంలో అంతర్రాష్ట్ర పురుషుల క్రికెట్ పోటీలను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్సిటీ స్పోర్ట్స్ కమిటీ సెక్రటరీ డాక్టర్ త్రిమూర్తి మాట్లాడారు. పోటీలను ఈ నెల 20 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రికెట్ టీమ్‌ల పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నారాయణ మెడికల్ కళాశాల డైరెక్టర్ గంటా రవితేజ, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ అజయ్ రెజినాల్డ్, వైద్య, విద్యాసంస్థల ఓఎస్డీ సాంబశివరావు, ఆపరేషన్స్ హెడ్ రామారావు, క్యాంపస్ ఇన్‌చార్జి మునిశంకర్, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సెల్వియబాబు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా..

⇨ క్రికెట్ పోటీలు తొలి రోజు హోరాహోరీగా జరిగాయి. క్రీడాకారుల కోసం ఐదు గ్రౌండ్స్‌ను సిద్ధం చేశారు. గ్రౌండ్ – 1లో నిర్వహించిన తొలి మ్యాచ్‌లో నారాయణ డెంటల్ కళాశాల, పీఈఎస్ కుప్పం మెడికల్ కళాశాల జట్లు తలపడగా, కుప్పం జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో విజయవాడ ప్రభుత్వ డెంటల్ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కళాశాల జట్లు పోటీపడగా, విజయవాడ జట్టు విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో నారాయణ మెడికల్ కళాశాల, రాజమండ్రి ప్రభుత్వ మెడికల్ కళాశాల జట్లు తలపడగా, నారాయణ మెడికల్ కళాశాల విజయకేతనం ఎగురవేసింది.

⇨ గ్రౌండ్ – 2లో నిర్వహించిన మొదటి మ్యాచ్‌లో నిమ్రా మెడికల్ కళాశాల, చినకాకాణిలోని ఎన్నారై మెడికల్ కళాశాల జట్లు తలపడగా, ఎన్నారై టీమ్ విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కళాశాల, అమలాపురం కిమ్స్ కళాశాల జట్లు తలపడగా, ఒంగోలు విజేతగా నిలిచింది. మూడో మ్యాచ్‌లో విశాఖ గాయత్రి మెడికల్ కళాశాల, గీతమ్ డెంటల్ కళాశాల జట్లు పోటీపడగా, గాయత్రి మెడికల్ కళాశాల టీమ్ గెలుపొందింది.

⇨ గ్రౌండ్ – 3లో జరిగిన మొదటి మ్యాచ్‌లో రాజమహేంద్రవరం జీఎస్సెల్ మెడికల్ కళాశాల, శాంతిరామ్ మెడికల్ కళాశాల జట్లు తలపడగా, శాంతిరామ్ జట్టు విజయకేతనాన్ని ఎగురవేసింది. రెండో మ్యాచ్‌లో చిన్నఅవుటపల్లి పీఎస్సైమ్మెస్ కళాశాల, అమలాపురానికి చెందిన కిమ్స్ కళాశాల జట్లు పోటీపడగా, పీఎస్సైమ్మెస్ గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఏలూరు ఏఎస్రామ్ఏఎం కళాశాల పోటీపడ్డాయి.

⇨ గ్రౌండ్ – 4లో నిర్వహించిన మొదటి మ్యాచ్‌లో రాజమహేంద్రవరం జీఎస్సెల్ డెంటల్ కళాశాల, కాటూరి మెడికల్ కళాశాల జట్లు తలపడగా, కాటూరి జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల, శ్రీకాకుళానికి చెందిన జీఈఎమ్మెస్ జట్లు పోటీపడగా, జీఈఎమ్మెస్ విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల, కడప ఫాతిమా మెడికల్ కళాశాల జట్లు పోటీపడగా, గుంటూరు జట్టు విజేతగా నిలిచింది.

⇨ గ్రౌండ్ – 5లో నిర్వహించిన మొదటి మ్యాచ్‌లో విశాఖపట్నానికి చెందిన ఎన్నారై మెడికల్ కళాశాల, కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల జట్లు పోటీపడగా, రంగరాయ మెడికల్ కళాశాల గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో నెల్లూరు ఏసీఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల, విశాఖపట్నానికి చెందిన అనిత డెంటల్ కళాశాల జట్లు పోటీపడగా, నెల్లూరు జట్టు గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో చిత్తూరు అపోలో మెడికల్ కళాశాల, ఏలూరు సెయింట్ జోసఫ్స్ డెంటల్ కళాశాల జట్లు పోటీపడగా, అపోలో మెడికల్ కళాశాల విజయం సాధించింది.

పూడికతీత పనులను గ్రాంట్ ద్వారానే చేయాలి

నెల్లూరు రూరల్: పంట కాలువల్లో పూడికతీత పనులను ఓ అండ్ ఎం గ్రాంట్ ద్వారానే చేపట్టాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు జలవనరుల శాఖ డీఈ అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. నరాల సుబ్బారెడ్డి, నారాయణయాదవ్, నీలిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి వీరేశలింగం జయంతి

నెల్లూరు(బృందావనం): సుబేదారుపేటలోని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద కందుకూరి వీరేశలింగం జయంతిని ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఫ్రాన్సిస్, అబ్దుల్ రషీద్, ప్రసాద్, మహేష్, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో బుధవారం ఉదయం వీచిన ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. బోడిగాడితోట సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్ తెగిపోవడంతో పలు ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న నెల్లూరు టౌన్ – 2 డీఈఈ సునీల్‌కుమార్ చేరుకొని యుద్ధప్రాతిపదికన సరఫరాను పునరుద్ధరించారు.

పబ్లిక్ హెల్త్ విభాగాధికారులతో సమావేశం



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెలా మూడో శనివారాన నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేయాలని అదనపు కమిషనర్ నందన్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణ పనులపై ఐవీఆర్‌ఎస్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహిస్తున్నారని, సంతృప్తి 70 శాతం కంటే తక్కువగా ఉందనే అంశాన్ని గుర్తించామని చెప్పారు. దీన్ని మెరుగుపర్చేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా పారిశుధ్య సిబ్బంది క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కోరారు. ట్రేడ్ లైసెన్స్‌ల మంజూరు, కొత్త లైసెన్స్‌ల గుర్తింపు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. హెల్త్ ఆఫీసర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, ఈఈ రహంతుజానీ, పొల్యూషన్ ఎన్విరాన్‌మెంటల్ ఈఈ అశోక్‌కుమార్, హోమ్ ల్యాండ్ ఏజెన్సీ సుమన్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభల జయప్రదానికి పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తిరుపతిలో మే 17న నిర్వహించనున్న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, మున్నా పిలుపునిచ్చారు. సంతపేటలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. నేతలు గౌస్‌బాషా, షానవాజ్, కరిముల్లా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సింహపురిలో అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి



మాట్లాడుతున్న ప్రదీప్ మాచిరాజు

నెల్లూరు(బృందావనం): అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి చిత్ర నటులు సింహపురిలో బుధవారం సందడి చేశారు. చిత్ర ప్రమోషన్లో భాగంగా రెయిన్ థియేటర్స్ ప్రాంగణంలోని ఐరా రెస్టారెంట్‌కు హీరో ప్రదీప్ మాచిరాజు, హీరోయిన్ దీపికా పిల్లి, నిర్మాత సుభాష్ పాలిశెట్టి, డైరెక్టర్లు నితిన్, భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నటీనటులు మాట్లాడారు. ఆద్యంతం నవ్వుల పువ్వులు పూయిస్తూ సాగడం చిత్ర ప్రత్యేకతని చెప్పారు. చిత్రాన్ని సక్సెస్ చేస్తున్న ప్రేక్షక దేవుళ్లను స్వయంగా కలవాలనే ఉద్దేశంతో వచ్చామన్నారు. అద్భుతమైన ఫుడ్‌కు నెల్లూరు పేరని చెప్పారు. వీరిని భానుప్రశాంత్, తేజస్వి, సునీల్, ఈశ్వర్ తదితరులు సత్కరించారు.

ఉచిత అంబులెన్స్ సేవలు అభినందనీయం



నెల్లూరు(అర్బన్): ఉచిత అంబులెన్స్ సేవలను అంబులెన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడాన్ని మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు అభినందించారు. నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి ఆవరణలో ఉచిత అంబులెన్స్ సేవలను బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగర పరిధిలోని పేదల కోసం ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఐటీయూ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్, పెంచలనరసయ్య, నేతలు నరమాల సతీష్, సందానీ బాషా, సురేష్, మాలకొండయ్య, ఖలీల్, సంపత్, అంబులెన్స్ వర్కర్స్ యూనియన్ నేతలు సాయి కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల నిరసన



నెల్లూరు(అర్బన్): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్ రసూల్ సాహెబ్‌కు 18 నెలల పెండింగ్ జీతాలను తక్షణమే విడుదల చేయాలని పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ ఎదుట నిరసనను బుధవారం చేపట్టారు. డీఎంహెచ్‌ఓ సుజాత అందుబాటులో లేకపోవడంతో అడ్మినిస్ట్రేటివ్ అధికారి నిశాంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుబాబు మాట్లాడారు. జలదంకి పీహెచ్‌సీ పరిధిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న రసూల్ సాహెబ్ 2023 అక్టోబర్ నుంచి గతేడాది నవంబర్ వరకు డిప్యుటేషన్‌పై పలు ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తించారని చెప్పారు. అయితే 18 నెలలుగా జీతాలివ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా చెల్లించాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలకు వినతి



ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(క్రైమ్): మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కించపర్చేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన ఐటీడీపీ కార్యకర్తపై చర్యలు చేపట్టాలని పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యకు వినతిపత్రాన్ని బుధవారం సమర్పించారు. ఇక్బాల్, జుబేర్, రంజిత్, కిరణ్, ముజఫర్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



ఎన్జీఓ భవన్ సమీపంలో..



మద్రాస్ బస్టాండ్ సమీపంలో..

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ఎన్జీఓ అసోసియేషన్ కార్యాలయ ఎదుట ఏర్పాటు చేసిన మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్కాకుల పెంచలయ్య, అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయవర్మ, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుబాబు, నేతలు కరుణమ్మ, కిరణ్, రాజేంద్రప్రసాద్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


నెల్లూరు(వీఆర్సీసెంటర్): మద్రాస్ బస్టాండ్ వద్ద జిల్లా సహకార శాఖ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల వినియోగదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీసీఓ గుర్రప్ప ప్రారంభించారు.

పోలేరమ్మకు కుంకుమార్చన



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని యనమలపాళెంలో పోలేరమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కుంకుమార్చనను బుధవారం జరిపారు. జాతరలో భాగంగా నగరోత్సవాన్ని గురువారం రాత్రి ఎనిమిదికి నిర్వహించనున్నామని యనమలపాళెం మిత్రమండలి నిర్వాహకులు తెలిపారు.

తృుటిలో తప్పిన ప్రమాదం



రహదారిపై కూలిన గోడ

నెల్లూరు సిటీ: ఈదురు గాలులకు గుడిపల్లిపాడు – నరుకూరు ప్రధాన రహదారిలోని భారీ గోడ బుధవారం ఉదయం కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. రోడ్డుకు అడ్డంగా గోడ పడిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతరం జేసీబీ సాయంతో గోడను మిల్లు యజమానులు తొలగించారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనులకు పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో చేపట్టనున్న పలు జీర్ణోద్ధరణ పనులకు సంబంధించిన పూజలను రెండో రోజు బుధవారం నిర్వహించారు. కంచికామకోటి పీఠాధిపతి ఆదేశానుసారం వారి ఆస్థాన సిద్ధాంతి విజయ సుబ్రహ్మణ్యం తదితరుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను జరిపారు. దాతలు అల్లూరు సులోచనమ్మ, అల్లూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, లత, అల్లూరు మహేష్‌రెడ్డి, రాధిక దంపతులు, కార్పొరేటర్ అహల్య, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ,, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

కృత్రిమంగా పండ్లు మగ్గబెడితే చర్యలు

నెల్లూరు రూరల్: పండ్లను కృత్రిమంగా మగ్గబెడితే చర్యలు తప్పవని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. పండ్లను కృత్రిమంగా మగ్గబెట్టడం, క్యాల్షియం కార్బైడ్‌ను నిరోధించడంపై జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో జూమ్ మీటింగ్ ద్వారా బుధవారం ఆయన చర్చించారు. మామిడి పండ్లను మగ్గబెట్టే ప్రక్రియను నిరోధించడంపై అధికారులకు సూచనలు చేశారు. రైతు బజార్లు, మార్కెట్లలో రిటైల్, హోల్‌సేల్ దుకాణాల్లో తనిఖీలను చేపట్టాలని ఆదేశించారు.